క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఆడే గజేందర్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛాలు అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కుప్టి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది గ్రామస్తులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న వాహనంతో ఎస్సై తిరుపతి

ఇచ్చోడ: మండల కేంద్రంలో సిరిచెల్మ చౌరస్తాలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ జాదవ్ రామారావు తెలిపారు. శుక్రవారం లక్కే కైలాస్ అనే వ్యకి ఏపీ 07 టీజీ 2956 వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రావణ దహనం నిర్వహించొద్దు



మాట్లాడుతున్న అర్క గోవింద్

నార్నూర్: దసరా పండుగ సందర్భంగా రావణ దహనం చేయవద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్క గోవింద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యుడు రావణాసురుడు అన్నారు. అతడి చరిత్ర తెలుసుకోకుండా రావణ దహనం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామారావు, వినోద్, హీరాలాల్, బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలను ఆదుకోవాలి



వివరాలు సేకరిస్తున్న బొర్రన్న

బోథ్: ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు, రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మండలంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన పూల్‌సింగ్ నాయక్ తండా గ్రామానికి చెందిన రాథోడ్ భాస్కర్, మండల కేంద్రానికి చెందిన ఆనందపు రవితేజ కుటుంబాలను పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జీవో 194 ప్రకారం ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు రూ. 6 లక్షలు ఇవ్వాలని కోరారు. సురేందర్, రఘువంశీ, సురేశ్, యువరాజ్ పాల్గొన్నారు.

వెళ్లి రావమ్మా.. దుర్గమ్మా



ఆదిలాబాద్: నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు



ఆదిలాబాద్: మంగళ హారతులతో మహిళలు



ఆదిలాబాద్: నృత్యం చేస్తున్న యువతులు

ఆదిలాబాద్/ఇచ్చోడ/బోథ్: నవరాత్రుల్లో ఘనంగా పూజలు అందుకున్న అమ్మవారు.. గంగమ్మ ఒడికి చేరుకుంది. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు, యాగాలు, కుంకుమార్చన ఉత్సవాలను జరుపుకున్నారు. శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి భక్తి గీతాలు, దాండియా నృత్యాలు, మేళ తాళాలు, డీజే చప్పుళ్ల నడుమ దుర్గమ్మకు వీడ్కోలు పలికారు. చల్లగా చూడాలని, మళ్లీ ఏడు త్వరగా రావాలని వేడుకున్నారు.

వైభవంగా కుంకుమార్చన

బజార్‌హత్నూర్/ఇంద్రవెల్లి: బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని దుర్గామాత మండపంలో శుక్రవారం వేదపండితులు ప్రవీణ్‌దేశ్‌పాండే మంత్రోచ్ఛరణల మధ్య కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- ఇంద్రవెల్లి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో దుర్గదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని సర్వజనిక్ దుర్గాదేవి మండపం వద్ద కుంకుమార్చన, హోమం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ఇచ్చోడ: దాండియా ఆడుతున్న మహిళలు



నేరడిగొండ: వడూర్‌లో..



బజార్‌హత్నూర్‌లో..



హోమం పూజలో పాల్గొన్న భక్తులు

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎంపీ నగేశ్



పూజలు చేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

బోథ్: మండల కేంద్రంలోని దుర్గామాతకు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాత ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. అనంతరం ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా దుర్గా కమిటీ సభ్యులు ఎంపీని శాలువాతో సత్కరించారు. పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, నాయకులు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని పలు దుర్గామాతా మండపాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి జోగు రమతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

నేరడిగొండ: మండలంలోని కుమారి, బుగ్గారం గ్రామాల్లో దుర్గామాతలను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దుర్గా కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట నాయకులు ప్రఫుల్ రెడ్డి, బద్దం పోతారెడ్డి, ఏలేటి రాజు రెడ్డి, జనార్దన్ ఉన్నారు.

బేల: ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి దంపతులు శుక్రవారం బేల మండలంలో బతుకమ్మ, దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు హాజరయ్యారు. ముందుగా భవానీగూడలోని భవానీ మాత ఆలయాన్ని సందర్శించి సతీమణి మౌనా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మశాల(బి) గ్రామంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.

నేరడిగొండ: దుర్గాదేవి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆకాంక్షించారు. దేవి శరన్నవరాత్రి ముగింపు సందర్భంగా శుక్రవారం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



పరిశీలిస్తున్న తహసీల్దార్ గోవింద్

ఆదిలాబాద్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ బుక్కె గోవింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంకాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మెనూ, పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోషన్ చర్చా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట ఆర్ఐ శకుంతల, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

యువతను చైతన్య పర్చండి

బోథ్: ఇటీవల కాలంలో యువత ఆత్మహత్యకు పాల్పడటం కలచి వేస్తోందని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ అన్నారు. యువతకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, చైతన్య పర్చాలననారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ సుభాష్ చందర్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లను శుక్రవారం వినతిపత్రం అందజేశారు. యువకులు ఆత్మహత్యకు పాల్పడవద్దన్నారు.

గురుకులాలు ఏర్పాటు చేయాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ప్రాంతంలో ఆదర్శ సమీకృత గురుకులం ఏర్పాటు చేయాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదర్శ గురుకులాల ఏర్పాటు ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో బొంత ఆశారెడ్డి, నాగోరావు, రాజేశ్వర్, వెంకటేశ్, కొత్తపల్లి మహేందర్, ఖయ్యూం, ప్రభాకర్ పాల్గొన్నారు.

పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కొనుగోళ్లను పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్

తాంసి: రైతులు పండించిన సోయా పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులు విక్రయించడానికి తీసుకువచ్చిన సోయా పంటను పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనంతరం గిరిగాం గ్రామంలో దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ధనుంజయ్, సీఈవో కేశవ్, రాజ్‌బలి, తులసీరాం, సొసైటీ సిబ్బంది సిద్దార్థ్ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఇంద్రాదేవికి ‘మెస్రం’ పూజలు



జెండా ఆవిష్కరిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: దసరా పురస్కరించుకుని మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో మెస్రం వంశీయులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలివచ్చారు. నవ ధాన్యాలతో తయారుచేసిన నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. శనివారం నాగోబా ఆలయంలో ఆనవాయితీ ప్రకారం ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. ఇందులో వంశపెద్దలు చిన్నుపటేల్, కోసేరావ్, హనుమంత్‌రావ్, బాదిరావ్‌పటేల్, తదితరులున్నారు.



నైవేద్యాలు తయారు చేస్తున్న మెస్రం వంశ మహిళలు

ఘనంగా ఎస్పీ జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలుపుతున్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఎస్పీ గౌస్ ఆలం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీసు అధికారులు, ఉద్యోగుల మధ్య వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేక్ కట్ చేశారు. ఉద్యోగులు, సిబ్బంది ఎస్పీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా, పోలీసు అధికారులు, సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి శాలువాతో సత్కరించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్పూర్ గ్రామంలో పర్యటించారు. ముందుగా గ్రామంలో కొలువుదీరిన దుర్గామాతను దర్శించుకున్నారు. ఈసందర్భంగా దుర్గామాత, శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయాల నిర్మాణానికి రూ.10 లక్షలతో భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణానికి రూ.5 లక్షలతో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తి మార్గంలో పయనించాలి

ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. తీజ్ ఉత్సవాల సందర్భంగా మహిళలతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ కాలనీలో గల దుర్గామాతను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. శుక్రవారం నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండప నిర్వాహకులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

విగ్రహావిష్కరణ జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ఈనెల19న మండలంలోని తాటిగూడ గ్రామంలో నిర్వహించే కుమురం భీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ కోసం ఆదివాసీల హక్కులకై పోరాడిన యోధుడు కుమరం భీం అని కొనియాడారు. తాటిగూడ గ్రామంలో కుమ్రంభీం విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని, ఆదివాసీ పెద్దలు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని విద్యాశాఖ కమిషనర్‌కు వినతి



విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను డీఎస్సీ మెరిట్ అభ్యర్థులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యంతో తమకు అన్యాయం జరిగిందన్నారు. ఎస్జీటీలో 12వ ర్యాంక్ సాధించిన సాయికృష్ణ, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో జిల్లాలో 2వ ర్యాంక్ సాధించిన కందేకర్ శివాజీ, అదేవిధంగా మరాఠీ మీడియంలో ఓసీ ఉమెన్ కోటాలో 34వ ర్యాంక్ సాధించిన పల్లవి, స్పోర్ట్స్ కోటాలో జాదవ్ సంగీత 1489వ ర్యాంక్ వచ్చినప్పటికీ తమకంటే తక్కువ ర్యాంక్ వచ్చిన అభ్యర్థులకు ఉద్యోగం ఇచ్చారని, తమకు అన్యాయం జరిగిందని వాపోయారు. తప్పులను సవరించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి అందించాలి

నార్నూర్: తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు నేటి తరానికి అందించాలని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అదర్శనగర్ (జీన్‌గూడ)లో కొలువైనా దుర్గామతను ఆయన దర్శించుకున్నారు. దుర్గామాత ఆశీస్సులు ఎప్పుడు ప్రజలపై ఉండాలని వేడుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతిఒక్కరూ ఆధ్మాతిక మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బిరుజులాల్, లోఖండే కేశవరావు, పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గే కాంతారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, కర్మన్కార్ శాంతారావు పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో పీఈటీ ఉద్యోగం సాధించిన జిల్లా కేంద్రానికి చెందిన కన్యా మాధవిని సాహో తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శివప్రసాద్, జనరల్ సెక్రెటరీ వీరేష్, అజయ్ కుమార్, దివ్య, వనిత పాల్గొన్నారు.

రాత్రి వరకు సాగిన ఎఫ్‌డీసీ డాటా ఎంట్రీ



తహసీల్దార్లతో చర్చిస్తున్న కమిషనర్ ఖమర్ అహ్మద్

కైలాస్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఇంటింటి సర్వేకు సంబంధించిన డాటా ఎంట్రీ ప్రక్రియ శుక్రవారం రాత్రి వరకు కొనసాగింది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు రాంనగర్‌లో సర్వేను చేపట్టిన 900 కుటుంబాలకు సంబంధించిన వివరాలు సేకరించారు. వాటిని శుక్రవారంలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండటంతో మున్సిపల్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన కంప్యూటర్ ఆపరేటర్లతో నమోదు చేయించారు. అయితే పట్టణ పరిధిలోని కొంతమంది కుటుంబ సభ్యుల ఫొటోలను సేకరించకపోవడం ఇబ్బందికరంగా మారింది. వారి ఫొటోలను సేకరించాక వివరాల నమోదు రాత్రి వరకు చేపట్టారు. ఈ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆదిలాబాద్ అర్బన్, మావల మండలాల తహసీల్దార్లు ఎస్.శ్రీనివాస్, వేణుగోపాల్ దగ్గరుండి పర్యవేక్షించారు.